మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ,ఎమ్మెల్యే



నిర్మల్ ఎమ్మెల్యేకు స్వాగతం పలికిన ఆలయ అర్చకులు

**ఇటిక్యాల ఆగస్టు 4 ప్రభాతావర్త :** ఆదివారం అమావాస్య కావడంతో అల్లంపూర్ పట్టణంలో వెలసిన ఐదవ శక్తిపీఠం జోగులాంబ అమ్మవారి ఆలయాన్ని మెదక్ ఎంపీ రఘునందన్ రావవు కుటుంబ సమేతంగా అలాగే నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈవో పురంధర్ కుమార్ అర్చకులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.



అలంపూర్ జోగులాంబ అమ్మవారి ఆలయంలో పూజలు చేసిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు

## భక్తులతో పులకించిన శ్రీరామకొండ దివ్యక్షేత్రం..

### శ్రీరామ పాదాన్ని దర్శనం చేసుకున్న వేలాది మంది భక్తులు





శ్రీరామ దర్శనానికి బారులు తీరిన భక్తజనం (ఇన్‌సెట్లో) పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

**కోయిల్‌కొండ,ఆగస్టు 04 ప్రభాతవార్త :** మహిమాన్వితమైన శ్రీరామకొండ దివ్యక్షేత్రం ఆదివారం అమావాస్య నాడు భక్తులతో పులకించిపోయింది. శ్రీరామ పాదాన్ని దర్శించుకోవడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి శ్రీరాముని దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు శ్రీరాముని దర్శించుకుని తిరుగు

- మిగతా3లో..

## 108 వచ్చేనా..!

### మంత్రి లెటర్ కు స్పందన కరువు

### ఫౌండేషన్ ఇచ్చిన వెహికల్‌తో మ్యామ్యా అనిపిస్తున్న అధికారులు

**వీపనగండ్ల ఆగస్టు 4 ప్రభాతవార్త :** వీపనగండ్ల సామాజిక ఆరోగ్య 30 పడకల కేంద్రం ఉన్నది కానీ దీనికి మాత్రం 108 వెహికల్ మాత్రం అధికారులు పంపరు రోగులకు అందుబాటులో ఉండే విధంగా 108 వెహికల్ వీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రానికి అవసరమని అనేకసార్లు మంత్రి దృష్టికి తీసుకురాగా తక్షణమే దాన్ని వీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఏర్పాటు చేయాలని గత కలెక్టర్ ఉన్న సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వనపర్తి కలెక్టర్‌కు రికమండేషన్ లెటర్ ఇచ్చి ఆయన సొంత నిధులతో 30 లక్షల చెక్కును అందజేసినట్లు సమాచారం అయితే దీన్ని అధికారులు పక్కకు పెట్టి స్నేహ ఫౌండేషన్ వారు స్వచ్ఛందంగా






స్నేహ ఫౌండేషన్ వారు అందించిన వెహికల్

- మిగతా3లో..

## క్షేత్రస్థాయిలో ప్రణాళికలు..



సరళసాగర్ ప్రాజెక్టు ను పరిశీలిస్తున్న మంత్రి,ఎమ్మెల్యేలు

- తెలంగాణలో ప్రపంచస్థాయి పర్యాటక ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి
- వాటిని జాతీయ, అంతర్జాతీయ పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తాం
- ఎన్నో అవకాశాలు, వనరులు ఉన్నప్పటికీ... గత బీఆర్ఎస్ ప్రభుత్వం పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో నిర్లక్ష్యం వహించింది : మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొత్తకోట ఆగస్టు 4 ప్రభాతవార్త :** టూరిజం స్టడీ టూర్‌లో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో...పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేల బృందం సరళా సాగర్ ప్రాజెక్టు ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో ప్రపంచ స్థాయి పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని అన్నారు. తెలంగాణ ప్రకృతి రమణీయమైన ప్రదేశాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, చారిత్రక, వారసత్వ సంపదకు నెలవుగా ఉందని తెలిపారు. ఎన్నో



సరళసాగర్‌ను సందర్శిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

అవకాశాలు, వనరులు ఉన్నప్పటికీ గడచిన పది సంవత్సరాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పర్యాటక ప్రాంతాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఉమ్మడి పాలమూరులో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, పర్యాటకులను ఆకర్షించడం, పర్యాటక ప్రాంతాలను ప్రాచుర్యంలోకి తీసుకురావడం, మౌలిక వసతుల కల్పన, రహదారుల నిర్మాణం, తదితర అంశాలపై అధ్యాయనం చేస్తున్నామని వివరించారు. ఆసియా ఖండంలోనే రెండవదైన ఆటోమెటిక్ సైఫాస్ సిస్టం కలిగిన సరళా సాగర్ తో పాటు కోయిల్ సాగర్ ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. టెంపుల్ టూరిజంలో భాగంగా కురుమూర్తి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, వీరపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, వంశీ కృష్ణ, కసిరెడ్డి నారాయణ రెడ్డి, రాజేష్ రెడ్డి, మేఘారెడ్డి, అనిరుధ్ రెడ్డి, సిడబ్ల్యూసి మెంబర్ చల్లా వంశీచంద్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పర్యాటక కేంద్రంగా మారుస్తాం..

### మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి





విలేఖరులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

**చిన్నచింతకుంట,ఆగస్టు 04 ప్రభాతవార్త :** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నాగర్‌కర్నూల్ ఎంపి మల్లురవి, స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్‌తో కలిసి జాతర మైదానంలో విలేఖరులతో మాట్లాడుతూ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు పరిశీలిస్తున్నట్లు వారు తెలిపారు. శ్రీ కురుమూర్తిస్వామి ఆశీస్సులతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని వారు తెలిపారు. అంతకు ముందు పర్యాటక కేంద్ర పర్యటనలో భాగంగా ఆదివారం స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏఐసిసి సభ్యులు చల్లా వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్‌తో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కురుమూర్తి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలో భాగంగా కొండపైకి చేరుకోగానే దేవస్థానం అధికారులతో పాటు అర్చకులు బాజా భజంత్రీల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు వేద పండితులు ఎమ్మెల్యేలను శాలువాలతో సత్కరించి ఆశీర్వచనాలు అందించారు. ఈ ఎమ్మెల్యేల బృందంలో వీర్లపల్లి శంకర్ (షాద్‌నగర్) అనిరుధ్‌రెడ్డి (జడ్చర్ల), కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి (నాగర్‌కర్నూల్), కసిరెడ్డి నారాయణరెడ్డి (కల్వకుర్తి), వంశీకష్ణ (అచ్చంపేట), వాకిటి శ్రీహరి (మక్తల్), బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (గద్వాల), మెగారెడ్డి (వనపర్తి), గద్వాల మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత తిరుపతయ్యలు ఉన్నారు. అంతకు ముందు మంత్రి జూపల్లి కృష్ణారావును డిప్యూటి కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ స్వాగతం పలికారు. ఎస్పీ జానకి ధరావత్ బందోబస్తును పర్యవేక్షించారు. కార్యక్రమంలో దేవస్థాన అధికారులు,ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కురుమూర్తి స్వామిని దర్శించుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

## తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు..

- మోడల్ వసతి గృహంలో పురుగుల అన్నంపై స్పందించిన అధికారులు...
- మెను ప్రకారం భోజనం అందించాలి...
- మోడల్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి

**వెల్దండ, ఆగస్టు 04 ప్రభాతవార్త:** వసతి గృహంలో విద్యార్థినులకు ప్రభుత్వం నిర్దేశించిన మెను ప్రకారం భోజనం అందించాలని మోడల్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ వసతి గృహ విద్యార్థులకు పురుగల అన్నం తిని అనారోగ్యంతో దవాఖానాల పేరిట ప్రచురితమైన కథనాలపై స్పందించి మోడల్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి, డీఈఓ గోవిందరాజులు ఆదివారం మోడల్ వసతి గృహన్ని వేర్వురుగా తనిఖీలు చేశారు. వసతి గృహంలోని వంట గదిని పరిశీలించడంతో పాటు విద్యార్థినులకు అందిస్తున్న అన్నం, కూరగాయలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి మాట్లాడుతూ వసతి గృహాల్లో పేద, మధ్య తరగతి విద్యార్థినులు చదువుకుంటారని, వారికి కావాల్సిన మౌళిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని, వాటిని అమలు చేసేందుకు వార్డెన్, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. మెను ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రికి అన్నం సరైన సమయాల్లో అందించారు. ఉదయం అల్పాహారం సమయాల్లో విద్యార్థినులకు భోజనాన్ని అందిస్తున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందని, మెను పాటించకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. వసతి గృహ ఇన్‌చార్జి అధికారి, కేర్ టేకర్ సమన్వయంతో మౌళిక వసతులు కల్పించాలని, ప్రధానంగా లైటింగ్, నీటి వసతి సమస్యలను తొలగించాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్న ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూసుకోవాలని, భోజనం తర్వాత తప్పకుండా పరిశీలించి విద్యార్థినులకు అందించాలన్నారు.



విద్యార్థినులు భోజనం చేస్తున్న సమయంలో ఆహారాన్ని పరిశీలిస్తున్న మోడల్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి



**వసతి గృహం వద్ద విద్యార్థినుల తల్లిదండ్రుల ఆందోళన...** తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం సూదర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ వసతి గృహంలో ఉంచి చదివిస్తే విద్యార్థినులకు ఇచ్చే ఆహారం పురుగుల అన్నమివ్వడం చాలా బాధకరంగా ఉందని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహ వార్డెన్, సిబ్బంది పిల్లలకు కూడా

- మిగతా3లో..

## మన్యంకొండలో శ్రావణమహోత్సవ పూజలకు ముహూర్తం ఖరారు..

- 5నుండి సెప్టెంబర్ 8వరకు విశేషోత్సవాలు
- ప్రతిరోజు శ్రీ లక్ష్మీసహస్రనామార్చన,విష్ణుసహస్రనామార్చన పూజలు
- విశేషోత్సవాల సందర్భంగా భక్తుల దర్శన వేళలు ఖరారు
- 31న దేవస్థానంలో ఉట్ల మహోత్సవం

**దేవరకద్ర,ఆగస్టు 04 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరుగాంచిన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 5 నుండి శ్రావణమహోత్సవ పూజలు ప్రారంభంకాను న్నాయి. ప్రతి ఏడాది దేవస్తానంలో శావణమహోత్సవ పూజలను అత్యం త ఘనంగా నిర్వహిస్తారు.ఈ విశేషోత్సవాలకు జిల్లా నుండేగాక వివిద జిల్లాలు,రాష్ట్రాలనుండి కొన్ని వేల మంది భక్తులు స్వామి వారి దర్శనానికి మన్య ంకొండకు అధికసంఖ్యలో తరలివస్తారు.శ్రావణమాసం విశేషోత్సవాల సందర్భంగా దేవస్థానంలో ఈ ఏడాది కూడ శావణమహోత్సవ పూజలకు అన్ని ఏర్పాట్లు చేశారు. వచ్చే నెల సెప్టెంబరు 8వరకు స్వామి వారి సన్నిధిలో ఈ విశేషోత్సవాలు జరుగనున్నాయి.ఈ సంద ర్భంగా దేవస్థానంలో ప్రతిరోజు ఉదయం శ్రీ లక్ష్మీసహస్రనా మార్చనపూజ,మద్యాహ్నం విష్ణుసహస్రనామార్చన,హనుమ ద్దాసుల వారి భజన పారాయణం,శాంతి హోమం,సాయంత్రం శ్రీ వెంకటేశ్వరసహస్రనామార్చన,శ్రీ రామ సహస్రనామార్చన, భజన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.ప్రతి బుధ,గురు,శుక్ర వారాలలో శ్రీ స్వామివారికి పంచామృత అభిషేకం,ప్రతి శనివారం రా త్రి 9లకు శ్రీ స్వామివారి శేషవాన సేవా పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు.అలాగే ఈ నెల 15న 24 గంటలపాలు శ్రీ విష్ణుసహస్రనామ అఖండపారా యణం నిర్వహిస్తారు.27న శ్రీ కృష్ణ అష్టమి

- మిగతా2లో..



మన్యంకొండ దేవస్థానం

# నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న జీకేఆర్ ఫౌండేషన్

**- మృతురాలు కుటుంబానికి ఆర్థికసహాయం అందజేసిన కోన రాజశేఖర్**

**- ఎమ్మెల్యే ఆదేశానుసారం సేవా కార్యక్రమాలు**

**దేవరకద్ర,ఆగస్టు 04 ప్రభాతవార్త:** నిరుపేద కుటుంబాలకు జీకేఆర్ ఫౌండేషన్ అండగా నిలుస్తుంది.ఎమ్మెల్యే మదుసూధన్‌రెడ్డి ఆదేశానుసారం గత కొన్ని నెలలుగా దేవరకద్ర మండలంలో జీకేఆర్ ఫౌండేషన్ చైర్మెన్ కోన రాజశేఖర్ నిరుపేదలకు,భాదితులకు ఏ ఆపదవచ్చిన తన వంతు ఆర్థికసహాయం చేసి అందరి ఆదరాభిమానాలు పొందుతున్నారు.దేవరకద్ర ఎమ్మెల్యే మదుసూధన్‌రెడ్డి ఆదేశానుసారం పలు సేవా కార్యక్రమాలను చేస్తున్నారు.ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.ఇది ఇలా ఉండగా దేవరకద్ర మండలం నాగన్నపల్లెలో నిరుపేద కుటుంబానికి చెందిన యాదయ్య తల్లి బాలమణి అనారోగ్యం కారణంగా మృతిచెందారు. మృతురాలి కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో ఈ విషయం తెలుసుకొన్న జీకేఆర్ ఫౌండేషన్ చైర్మెన్ కోన రాజశేఖర్ ఆ గ్రామానికి వెళ్ళి మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించి ఎమ్మెల్యే ఆదేశానుసారం ఆదివారం రూ.5వేల ఆర్థికసహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఒన్నడి రాజు,రవీందర్‌రెడ్డి,మైబు,పసుపుల అంజనేయులు,చెన్నయ్య,వెంకటయ్య,గద్మలి రాజేందర్,బాలయ్య,రాజన్న,ఆశన్న,రామచంద్రయ్య పాల్గొన్నారు.



మృతురాలి కుటుంబానికి ఆర్థికసహాయం అందజేస్తున్న కోన రాజశేఖర్

# జిల్లా అగ్నిమాపక దళాధికారికి ఘనంగా వీడ్కోలు

**గద్వాల ,ఆగస్టు 04,ప్రభాతవార్త:**జోగులాంబ గద్వాల జిల్లా అగ్నిమానకదళ అధికారి శ్రీదాస్ హైదరాబాద్కు బదిలీ కావడంతో ఆదివారం స్థానిక ఫైర్ స్టేషన్ లో వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు . ఈకార్యక్రమంలో నూతనంగా వచ్చిన అగ్నిమాపక శాఖ అధికారి ఆశోక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆత్మకూర్,వనపర్తి కుల్వకుర్తి నాగర కర్నూల్ తదితర ప్రాంతాల అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా ఫైర్ అధికారిగా 4,సంవత్సరాల 8 నెలల పాటు విధినిర్వహణలో వుంటూ ,సిబ్బందికి ప్రజలకు ఎనలేని సేవలందించారని కొనియాడారు .ముఖ్యంగా కరోనా సమయంలో విశేష సేవలు అందించారనీ ప్రశంసించారు .ఈ సందర్భంగా శ్రీదాస్ దంపతులను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు .ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .



వీడ్కోలు సమావేశానికి హాజరైన అధికారులు

# చౌడేశ్వరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

**పెబ్బేర్ ఆగస్టు 4 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం సూగురు గ్రామంలో గల శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారి పుట్టినరోజు వేడుకల్లో తొగుట వీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆలయ పూజారులు నిర్వహించిన అభిషేకం అలంకరణ కుంకుమార్చన మహా మంగళ హారతి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బల్సర్ ఈశ్వరయ్య, సుధాకర్, బుచ్చిబాబు, శ్రీనివాసులు, సీతారాం వెంకటేశ్వర్లు, బలుపరి రమేష్, మహేష్ పాల్గొన్నారు.



# పారిశుద్ధ్య సమస్యలపై అధ్యయనం



**వీపనగండ్ల ఆగస్టు 4 ప్రభాతవార్త :** గ్రామాలలో లోపిస్తున్న పారిశుధ్యం అని కెవిపిఎస్ మండల కార్యదర్శి మురళి అన్నారు వారు ఆదివారం నాడు వీపనగండ్ల మండల కేంద్రంలోని పలు వార్డులలో నెలకొన్న సమస్యలపై సిపిఎం పార్టీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామంలోని పలు కాలనీలలో సీసీ రోడ్లు ఉన్నప్పటికి, సైడ్ డ్రైనేజ్ లేకపోవడం వల్ల ఇళ్లలోని మురికి నీరు అంతా సీసీ రోడ్ల పై పారి మృదమయంగా మారి కాలనీవాసులకు ఇబ్బందిగా మారిందని అన్నారు. రైస్ మిల్ ఎస్టి కాలనీ దగ్గర ఇండ్ల మధ్య మురుగునీరు చేరి, దుర్గంధం వ్యాపించి ఈగలు, దోమలు వాలడంతో విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. కొన్ని వార్డులలో విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు లేకపోవడం వల్ల రాత్రి వేళలో విషపురుగుల ప్రమాదం పొంచి ఉందని, ఇండ్ల మధ్య పిచ్చి మొక్కలు ఉండడం ఇబ్బందికరంగా మారిందని అన్నారు. వార్డులలోనే మురుగు గుంతలు పూడ్చి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కాలనీవాసులు వాపోయారు. గ్రామంలో చేసిన సర్వే ఫలితంగా వచ్చిన సమస్యలపై పంచాయతీ కార్యదర్శి ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యే విధంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆశన్న, రైతు సంఘం నాయకులు ఈశ్వర్, ఎస్ఎఫ్ఐ నాయకులు రామకృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ధ్యానం ద్వారానే రోగాలు మాయం

**ఆత్మకూరులో భారీ ర్యాలీ**

**ఆత్మకూర్ ఆగష్టు 4 ప్రభాతవార్త :** సమాజంలో ప్రతి ఒక్కరూ శ్వాస మీద ధ్యాస అలవర్చుకొని ధ్యాన్యం చేయాలని శ్రీ హనుమసాయి పిరమిడ్ నిర్వాహకులు బంగ్లా ఆంజనేయ రెడ్డి అన్నారు. ఆదివారం రోజు ఆత్మకూరు పట్టణంలో సాయి పిరమిడ్ ఆధ్వర్యంలో శాఖాహారం ముద్దు మాంసాహారం వద్దు అనే నినాదంతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం ద్వారానే రోగాలన్నీ మాయమవుతాయని సమాజంలో ప్రతి ఒక్కరూ ధ్యానం అలవర్చుకోవాలని తద్వారా న్ని సమాజంలో హింస పచ్చరిల్లిపోకుండా అడ్డుకోగలుగుతామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మూగజీవాలను ప్రేమించడం పత్రి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని ప్రకృతిలో మానవు డు తాను జీవిస్తూ ఇతర జీవులను జీవించే విధంగా అలవాట్లను అలవర్చుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పురవీధి కాకుండా భారీ ర్యాలీ నిర్వహించడంతో పలువురు ర్యాలీకి మద్దతుగా వెంట నడవడం విశేషం ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాధాకృష్ణారెడ్డి, శివరాము లు, వెంకటేశ్వర్ గౌడ్ ,పల్లవి ,మంజుల, రఘుపతి రెడ్డి, వెంకటేష్ తదితరులతో పాటుగా పలువురు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సాయి పిరమిడ్ ఆధ్వర్యంలో ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# నేటి నుంచి స్వచ్ఛదనం..పచ్చదనం..!!

**- 5వ తేది నుంచి 9వ తేది వరకు ఐదు రోజుల పాటు నిర్వహణ..**

**- స్పెషలాఫీసర్లు,సిబ్బంధిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి ఉత్తర్వులు..**

**భూత్పూర్,ఆగస్టు 4,ప్రభాతవార్త :** గ్రామాలు,పట్టణాలలో పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంపొందించి ప్రజల జీవన ప్రమాణాల్ని మెరుగుపరిచాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు,జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశాలకనుగుణంగా ఈ నెల 5నుంచి 9వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛదనం,పచ్ఛదనం నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమాన్ని సమర్థ వంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి స్పెషలాఫీసర్లతో పాటు పంచాయతీ సెక్రటరీలు,ఆశా కార్యకర్తలు,అంగన్వాడీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.కలెక్టర్ ఆదేశాల మేరకు భూత్పూర్ మండల స్పెషలా ఫీసర్ వేణుగోపాల్,తహసిల్దార్ రాజు,ఎంపీడీఓ ప్రభాకర్‌చారి,ఎంపీఓ శ్రీదేవిలు కార్యక్రమాన్ని రపొందించారు. తొలిరోజు 5వ తేదిన స్వచ్ఛదనం-పచ్ఛదనం ప్రారంభ కార్యక్రమాలు నిర్వహిస్తారు.స్థానిక నాయకులతో కలిసి,స్వచ్ఛంద సంస్థల సభ్యులు,యూత్,వార్డు కమిటీలు,మహిళా సంఘాల సభ్యులతో కలిసి ప్రత్యేక సమవేశాలు నిర్వహించి ర్యాలీలు నిర్వహిస్తారు.ఇళ్లు,పాఠశాలల్లో పారి శుద్ధ్యం,తోటల పెంపకం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.రెండో రోజు 6వ తేదిన తాగునీరు,వాననీటితో సాగు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధవహించి తాగునీటి ట్యాంకుల శుభ్రం,తాగునీటిలో క్లోరినేషన్ వంటివి చేపడతారు. మూడో రోజు 7వ తేదీన మురుగుకాల్వలు,నీటి నిల్వలను తొలగించే ప్రక్రియలు చేపడతారు.నాల్గోరోజు 8వ తేదీన ప్రజారోగ్యం, వీధి కుక్కల బెడద వంటి సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చుడతారు.డెంగ్యూ,మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి ప్రజల్ని కాపాడేందుకు ఆరోగ్య చర్యలు చేపడతారు.వీధి కుక్కలనరికట్టిచిన్నపిల్లలు,అమాయకులు కుక్క కాటుక బలికాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటారు.చివరి రోజైన 5వ రోజు 9వ తేదీన ప్రభుత్వ, ప్రజా స్థలాల్ని శుభ్రపర్చడం వంటి పరిశుభ్రతా చర్యలు తీసుకుంటున్నట్లు స్పెషలాఫీసర్ వేణుగోపాల్,ఎమ్మార్వో రాజు,ఎంపీడీఓ ప్రభాకర్‌చారి ఎంపిఓ శ్రీదేవి తెలిపారు. మండలంలోని హస్నాపూర్, శేరుపల్లి, తాటికొండలకు స్పెషలాఫీసర్‌గా వేణుగోపాల్,వెల్కిచర్ల, మద్దిగట్ల, భట్టుపల్లిలకు స్పెషలాఫీసర్‌గా తహసిల్దార్ రాజు యు, అన్నాసాగర్,కప్పెట,కొత్తమొల్గర,రావులపల్లి,పోతులమడుగు,చౌలతండాలకు స్పెషలాఫీసర్‌గా ఎంపీఓ శ్రీదేవి, తాటిపర్తి,కొత్తూరు,పెద్దతండాలకు స్పెషలాపీసర్‌గా మురళిధర్,కరివెన.పాతమొల్గర,లంబడికుంట తండాలకు స్పెషలా ఫీసర్‌గా సీఎన్ స్వామిలు స్వచ్ఛదనం, పచ్ఛదనం కార్యక్రమాలకు స్పెషలాఫీసర్లుగా వ్యవహరిస్తున్నారు.



కార్యాలయ ఆవరణలో పచ్చని మొక్కల నడుమ తహసిల్దార్ రాజుతో పాటు కార్యాలయ సిబ్బంది

**పచ్చదనం తహసీల్ కార్యాలయ ఆవరణం :**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా పల్లెలు, పట్టణాలలో ఈ నెల 5వ తేది నుంచి 9వ తేది వరకు ఐదు రోజుల పాటు స్వచ్ఛదనం..పచ్ఛదనం పేరిట నిర్వహిస్తున్న పచ్ఛదనం భూత్పూర్ మండల తహసిల్ కార్యాలయ ఆవరణలో కన్పిస్తోంది.కార్యాలయ ఆవరణలో సుందరమైన పూల మొక్కలు,సత్యనారాయణ చెట్లు,కొబ్బరి,మామిడి టెంకల మొక్కలు విరివిగా నాటి తహసిల్దార్ రాజు మిగిలిన మండల అధికారులు,కార్యాలయాలకు ఆదర్శంగా నిలిచారు. తన కార్యాలయం ఆవరణలో పచ్ఛదనం, స్వచ్ఛదనం,పరిశుభ్రత కోసం కార్యాలయ సిబ్బంధి సహాయ సహకారాలం దించారని తహసిల్దార్ రాజు యు ఖప్రభాతవార్తగ ప్రతినిధితో తెలిపారు.నేటి నుంచి నిర్వహించే స్వచ్ఛదనం..స్వచ్ఛదనంలో తాను కూడా మండలంలోని మూడు గ్రామాలు మద్దిగట్ల,వెల్కిచర్ల,భట్లుపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహించే కార్యక్రమాలకు స్పెషలాఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు తహసిల్దార్ రాజు తెలిపారు.



పూలమొక్కలతో తహసిల్దార్ చేంబర్ ముందు కారిడార్

# ధరణి భూ సమస్యలతో రెవెన్యూ అధికారులకు కాసుల పంట

**ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షణ**

**వీపనగండ్ల ఆగష్టు 4 ప్రభాతవార్త :** ధరణి వెబ్సైటు ద్వారా రైతులు భూముల సమస్యలతో సతమతమవుతూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కోర్టుల చుట్టూ భూతగాదాలు పెట్టుకొని తిరుగుతున్న విషయము విధితమే అయితే ఈ వెబ్సైటును ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి వెబ్సైట్‌ను రద్దు చేస్తామని ప్రకటించినప్పటికి ఆ హామీ నెరవెరకపోవడం వల్ల దాని ద్వారా రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు దాన్ని ఆసరా చేసుకున్న రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు భూ సమస్యలు పరిష్కారానికి అధికారులకు ఎన్ని పైసలైన ఇవ్వడానికి లబ్ధిదారులు వెనకడుగు వేయకుండా తమ సమస్య పరిష్కారం కావాలని ఆవేదనతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు అయినా కూడా ఏండ్ల తరబడి ఈ సమస్యలు అలాగే ఉంటున్నాయి భూముల మార్పిడి రికార్డుల్లో సరిగా ఉందా లేదా అని ధరణి వెబ్సైట్ ద్వారా ఎప్పుడైతే బయటకు వచ్చిందో గత కేసిఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి ఆ వెబ్సైట్ సమస్య రాను రాను తీవ్రంగా అయిపోయింది పట్టాదారు ఒకరు భూమి ఒకరు భూమిని దున్నుతున్న సమస్య ఇతరులతో కొనుగోలు చేసినటువంటి రిజిస్టర్ డాక్యుమెంట్ ఉన్న అది పట్టాదారు పేరు మీదనే ఉండడం పక్క ఉన్న భూములను ఒకరి పేరుతో ఒకరికి పట్టాలు కావడం తదితర సమస్యలు తీవ్రంగా ఉన్నాయి ఈ సమస్యలు బొల్లారం ,తూముకుంట, వల్లభాపురం ,తండా ,గోపాల్ దీన్నే, పుల్గర్ జర్ల ,రంగవరం తదితర గ్రామాలలో ఇలాంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి లబ్ధిదారులు దరఖాస్తులు పెట్టుకొని కార్యాలయాల చుట్టూ తిరిగిన అవి పరిష్కారానికి నోచుకోవడం లేదు కానీ అధికారులకు మటకం కాసుల పంట పండుతుంది ఈ సమస్యపై కలెక్టర్ రివ్యూ సమావేశాలు రెవెన్యూ అధికారులతోటి నిర్వహిస్తున్న ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే ఉన్న చందంగా అవి పరిష్కారానికి మాత్రం నోచుకోవడం లేదు రంగవరంలో ప్రభుత్వ భూమి 1970 వ సంవత్సరము రంగవరం గోపాల్‌దిన్నే పేదలకు పంపిణీ చేసి ఆ సమస్య ఇప్పటికి అదేవిధంగా రగలుతూనే ఉన్నది కోర్టు చుట్టూ తిరుగుతున్నారు దానితోపాటు బొల్లారంలో కూడా ఇదే సమస్య తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని దరఖాస్తులు పెట్టుకున్న లబ్ధిదారులు అధికారులను కోరుతున్నారు.



# తిరుచ్చివాహనంపై ఊరేగిన వెంకటేశ్వరస్వామివారు

**- మన్యంకొండలో దక్షిణకట్ట వరకు ఘనంగా సేవ**

**- అలంకరణలో శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారి దర్శనం**

**దేవరకద్ర,ఆగస్టు 04 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారి తిరుచ్చిసేవను ధక్షిణకట్ట వరకు నిర్వహించారు. అక్కడ కూడ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పురోహితుల వేధమంత్రాలు,భక్తుల హరినామశ్చరణ,కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు.అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిద పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు.




మన్యంకొండలో తిరుచ్చిసేవ నిర్వహిస్తున్న పురోహితులు

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..** మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవపై శ్రీదేవిభూధేవి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు,బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మాయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది సుదర్శన్,నారాయణరెడ్డి,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**మన్యంకొండలో శ్రావణమహోత్సవ**

# పూజలకు ముహూర్తం ఖరారు..

**మొదటి పేజీ తరువాయి భాగం..** సందర్భంగా హనుమాద్దసుల వారి కీర్తనలతో అఖండ భజనను కూడ 24గంటలపాటు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మెన్,వంశ పారంపర్య ధర్మకర్త అళహరి మధుసూధన్‌కుమార్, ఈఓ శ్రీనివాస రాజు తెలిపారు.కావున భక్తులు ఈ శ్రావణ విశేషోత్సవాలలో అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.



**భక్తులకు అన్నప్రసాద వితరణ..**

దేవస్థానంలో ప్రతి శని,సోమవారాలలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు వె ంకటసుబ్బయ్య అధ్వర్యంలో,సేవా భారతి ద్వారా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఉదయం 10ల నుండి సాయంత్రం 5వరకు నిర్వహిస్తారు.మిగత రోజులలో దేవస్థానం తరపున మధ్యాహ్నం 12నుండి 1వరకు ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

**31న దేవస్థానంలో ఉట్ల మహోత్సవం..**

దేవస్థానంలో ఈ నెల 31న శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా దేవస్థానం ఆవరణలో ఉట్ల కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.దేవస్థానం ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారు.

**విశేషోత్సవాల భక్తుల దర్శన వేళలు..**

మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాసం విశేషోత్సవాల సందర్భంగా ప్రతి రోజు జరిగే భక్తుల దర్శన వేళలను దేవస్థానం అధికారులు ఖరారు చేశారు. దేవస్థానంలో ప్రతిరోజు ఉదయం 6.30నుండి1 వరకు,మద్యాహ్నం 2నుండి రాత్రి 9వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకోవచ్చు. అలాగే ప్రతి బుధ,గురువారాలలో ఉదయం 7నుండి1వరకు, మధ్యాహ్నం 3నుండి రాత్రి వరకు భక్తులు స్వామివారిని దర్శిం చుకోవచ్చు.ప్రతి శుక్రవారం,విశేష రోజులలో ఉదయం 8నుండి1వ రకు,మధ్యాహ్నం 2నుండి రాత్రి 9వరకు భక్తులు స్వామి వారిని ధర్శించుకోవచ్చని దేవస్థానం చైర్మెన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూధన్‌కుమార్,ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు.ఈ విషయంలో భక్తులు దేవస్థానానికి సహకరించాలని వారు కోరారు.

## కోయిల్‌సాగర్‌లో పెరుగుతున్న నీటిమట్టం

**-16.8ఫీట్లకు పెరిగిన నీటిమట్టం**

**- ఆయకట్టుకు కొనసాగుతున్న నీటిసరఫరా**

**దేవరకద్ర,ఆగస్టు04 ప్రభాతవార్త:**జిల్లాలోని భారీ నీటి పారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో నీటిమట్టం మళ్ళీ క్రమేపి పెరుగడం ప్రారంభమైంది.జూరాల నుండి కృష్ణాజలాలను కోయిల్‌సాగర్‌లోకి తరలిస్తుండటంతో ప్రాజెక్టులో నీటి మట్టం పెరుగుతుంది.ఆదివారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 16.8 ఫీట్లకు పెరిగింది. ఇది ఇలా ఉండగా ప్రాజెక్టునుండి ఆయకట్టుకు నీటిసరఫరా కొనసాగుతుంది.కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు.

## మందలో గొర్రెల చోరీ..

**బిజినపల్లి,ఆగస్టు 04 ప్రభాతవార్త :** మహదేవన్‌పేట గ్రామానికి చెందిన శ్రీశైలం బీరయ్య కర్రెన్న తిరుపతయ్యకు చెందిన గొర్రెలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. శనివారం అర్థరాత్రి రోడ్డు మార్గం పక్కనే ఉన్న పంట పొలాల్లో గొర్రెల మందను నిలిపారు. చడి చప్పుడు కాకుండా మహేంద్ర బొలెరో వాహనంలో వచ్చిన దొంగలు దాదాపు 14 గొర్రెలను ఎత్తుకెళ్లినట్లు వివరించారు. గుర్తించిన కాపరులు దొంగలను పట్టుకునే ప్రయత్నం చేసిన రాళ్లతో దాడిచేసి బొలెరో వాహనంలో పరారైనట్లు వివరించారు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

## స్నేహం మరువలేనిది.,స్నేహం వెలకట్టలేనిది..!!

**- ఘనంగా స్నేహితుల దినోత్సవం..**



**భూత్పూర్,ఆగస్టు 4,ప్రభాతవార్త :** కాలమనే కడలిలో..స్నేహమనే పడవలో కడదాకా పయనించేవాడే నిజమైన స్నేహితు డు. స్నేహ బంధానికి మరే ఇతర బంధం సాటిరాదు.స్నేహం ఎన్నడూ మరువలేనిది..స్నేహం వెలకట్టలేనిది.. నాలుగు రోజుల పరిచయమైన నలభయ్యేళ్ల బంధమైన స్నేహం..స్నేహమే అమౌతుంది.స్వచ్ఛమైన స్నేహానికి మరణ ముండదు.మోసం,దగా అసలే ఉండదు.చిన్నా-పెద్దా తేడా లేకుండా పండు ముదుసలి కూడా తన చిన్ననాటి సేహాన్ని, స్నేహితుల్ని మననం చేసుకుంటూ కాలాన్ని వెల్లదీస్తాడు.స్నేహానికి విలువిచ్చి స్నేహబంధాన్ని ఎల్లవేళలా కాపాడుకునే ప్రతి స్నేహితులు ఆదివారం స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు.

## జన్మదిన వేడుకలో పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి..!!

**భూత్పూర్,ఆగస్టు 4,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం మద్దిగట్ల కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజమల్లయ్య కూతురు జన్మదిన వేడుకలు ఆదివారం మద్దిగట్లలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దెంది లక్ష్మీకాంత్‌రెడ్డి ఇతర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## చౌడేశ్వరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



**పెబ్బేర్ ఆగష్టు 4 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపాలిటీ కేంద్రంలో గల శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి పిజెపి క్యాంప్ ఆలయంలో అమ్మవారి పుట్టినరోజు వేడుకల్లో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పాల్గొనగ, ఆలయ పూజారులు వారిని ఆహ్వానించిన అనంతరం, వారు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువా పూల మాలలతో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు,ఆలయ కమిటీ సభ్యులు, మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# 108 వచ్చేనా..!

**మొదటి పేజీ తరువాయి భాగం..**
ఒక వెహికల్ ను కలెక్టర్ కు ప్రొవైడ్ చేయగా దాన్నే వీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రానికి పంపించి మ్యా అనిపిస్తున్నారు. అయితే ఇక్కడ విచిత్రం ఏమిటంటే ప్రభుత్వం పంపించే 108కు అత్యవసరంగా రోగులకు అవసరం పడినప్పుడు వారిని ఇతర ప్రాంతాలకు తరలించేటందుకోసం డబ్బులు ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది కానీ ప్రస్తుతం ఉన్న వెహికల్ కు మాత్రం అత్యవసరంగా రోగి ఇతర హాస్పిటల్‌కు వెళ్లాలంటే డీజిల్ కోసం 1500 రూపాయలు తన సొంతంగా భరించాల్సి వస్తుంది ఈ రకంగా మంత్రి ఇచ్చిన లెటర్ కు ఇక్కడి ప్రజలు అంటున్నారు. అయితే వీపనగండ్ల ఉమ్మడి మండలానికి 108 వెహికల్ ఎంతో అవసరమని గత అనేక సంవత్సరాల నుండి ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆందోళన చేశారు అధికారులను కూడా నిలదీశారు అయినా ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడం శోచనీయం ఉమ్మడి మండలంలోని చిన్నంబావి మండలం కూడా ప్రధానమైనటువంటిది అక్కడి గ్రామాలకు కృష్ణానది సమీపంలో ఉంటాయి అక్కడి ప్రజలకు ఏమైనా ఇబ్బందులు కలిగాయంటే పాన్‌గల్ లో ఉన్న 108 వెహికల్ ఫోన్ చేస్తే రావాలి అది వచ్చేలోపు రోగులకు జరగవచ్చు ఈ విషయాన్ని అధికారులు గమనించకపోవడం ఒక మంత్రి ఇచ్చిన లెటర్ కి స్పందన లేకపోతే మామూలు ప్రజలకు ఏ రకమైన స్పందన ఉంటుందో మనకు అర్థమవుతుంది అయితే ఇటీవల కొత్తగా వచ్చినటువంటి 108 వెహికల్స్ ను వనపర్తి తాలుకాలోని మండలాలకు ఇస్తున్నారు కానీ కొల్లాపూర్ తాలుకాలోని వీపనగండ్లకు ఇవ్వడం లేదు అని ఇక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కుల అందజేత...

**కల్వకుర్తి, ఆగస్టు 04 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డలకు కానుకగా అందించనున్న కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా లబ్దిదారులకు అందించనున్నారని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. చెక్కులు మంజూరైన లబ్దిదారులు ఉదయం 11గంటలకు ఎమ్మెల్యే క్యాంప్‌కార్యాలయానికి విచ్చేసి చెక్కులు అందుకోవాలన్నారు. అదే విధంగా కేఎల్ఐ కాల్వ నీటికి జలహారతి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## విజయవంతమైన రక్తదాన శిబిరం...



**కల్వకుర్తి, ఆగస్టు 04 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని లయన్స్ భవన్‌లో కల్వకుర్తి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరం విజయవంతమైంది. రక్తదాన శిబిరాన్ని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షులు లక్ష్మారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. బీఆర్ఎస్వీ కల్వకుర్తి మండల అధ్యక్షులు దారమోని గణేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, లయన్స్‌క్లబ్‌ల సంయుక్త ఆధ్వ ర్యంలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో 51 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ ప్రమాద సమయాల్లో ఎంతో మంది క్షత గాత్రులకు సరైన సమయంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని, రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చునని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు ఉప్పల వెంకటేష్ సైతం రక్తదానం చేసి యువతకు ప్రేరణగా నిలిచి ప్రతి ఒక్కరు రక్తదానం ఇవ్వాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో కల్వకుర్తి లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, గోల్డ్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు శ్రీనివాసులు, బీఆర్ఎస్వీ నాయకులు, లయన్స్‌క్లబ్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## మిక్కి ఔత్సాహిక వ్యాపార వేత్తలను తయారు చేయాలి

**-ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం**



**కల్వకుర్తి, ఆగస్టు 04 ప్రభాతవార్త:** సమాజంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న మాదిగల ఆర్థిక సాధికారితకు మిక్కి తోడ్పాటు అందివ్వాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం అన్నారు. ఆదివారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను నాగర్‌కర్నూల్, హైదరాబాద్ మిక్కీ బృందం సభ్యులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రీతం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తుందని చైర్మన్ ప్రీతం పేర్కొన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఎన్నడు లేని విధంగా ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించారని పేర్కొన్నారు. మిక్కి ఔత్సాహిక వ్యాపార వేత్తలను తయారు చేయాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో మిక్కి రాష్ట్ర నాయకులు కాంపల్లి రాము, బంగారు సంజయ్, ఏకే రాజు, తదితరులు ఉన్నారు.

## దత్తాత్రేయ స్వామికి నిత్యపూజలు

**గార్లపల్లి కాంగ్రెస్ యువ నాయకులు అశోక్‌గౌడ్**



**మక్తల్ టౌన్, ఆగస్టు 04 ప్రభాతవార్త :** మండలంలోని పస్పుల గ్రామంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా నిండు అమావాస్య కృష్ణానది సమీపంలో వెలసిన శ్రీశ్రీశ్రీ దత్తాత్రేయ స్వామి వారిని దర్శించుకోవడం జరిగింది. ఇందులో భాగంగా శ్రావణమాస ఆరంభ అమావాస్య సందర్భంగా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ పాలనను విజయవంతంగా కొనసాగించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో గార్లపల్లి గ్రామ యువ నాయకులు అశోక్‌గౌడ్, అశోక్ గజ్జెలి, అంజి, దెబ్బలు శ్రీను, మాలా అశోక్ పాల్గొన్నారు.

## జాతికి చేసిన సేవలు శాశ్వతంగా గుర్తుంటాయి



**బిజినపల్లి, ఆగస్టు 04 ప్రభాతవార్త :** ప్రిన్సిపల్ పెబ్బేటి మల్లికార్జున్ ముదిరాజ్ జాతికి చేసిన సేవలు శాశ్వతంగా గుర్తుండిపోతాయని మండల మత్స్యకార్మిక సంఘం అధ్యక్షులు తుమ్మల అల్లోజీ అన్నారు. పాలెం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తూ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్తున్న సందర్భంగా మత్స్యకారుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించుకున్నారు. అల్లోజీ మాట్లాడుతూ తెలుగు మత్స్యకారులను చైతన్యపరుస్తూ జాతి పుట్టుకకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను ఎప్పటికప్పుడు తెలియజేసి చైతన్యపరిచిన వ్యక్తి మల్లికార్జున్ సార్ అన్నారు. ముఖ్యమైన ఆధారాలను, జాతి బలాన్ని, జాతి బలహీనతలను తెలియపరుస్తూ, జాతి ఆర్థిక అసమానతలను సామాజిక అసమానతలను ఎలా ఎదుర్కోవాలో రాజకీయపరంగా చైతన్యం చేసిన వ్యక్తి ఎప్పటికీ ఈ ప్రాంతంలో గుర్తుండిపోతాడని అన్నారు. మున్ముందు ఇలాంటి సేవలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో పెబ్బేటి మల్లికార్జున్ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల చెవిటి తిరుపతి, ఖానాపురం మిద్దె యాదయ్య, పాలెం బాలస్వామి, బోళ్ల కృష్ణయ్య, బిజినపల్లి పట్టణ మత్స్యకారులు పాల్గొన్నారు.

## ఆలయానికి ప్లేట్ల వితరణ

**మక్తల్, ఆగస్టు 04 ప్రభాతవార్త :** మండలంలో కర్ని శ్రీ లింగమయ్య స్వామి ఆలయానికి ఆదివారం గ్రామ యువకుడు కటికెలి లింగప్ప 50 స్టీల్ ప్లేట్లను అంజేశారు. ప్రతినెలా అమావాస్య రోజు ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం తన వంతు సహాయంగా ప్లేట్లను అందజేసినట్లు లింగప్ప తెలిపారు. అమావాస్య సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.

# శ్రీ కురుమూర్తి కొండకు పోటెత్తిన భక్తజనం..

### గోవింద నామస్మరణతో మారుమ్రోగిన కురుమతి గిరులు



ముఖద్వారం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

**చిన్నచింతకుంట, ఆగస్టు 04 ప్రభాతవార్త :** పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా కొలువబడుతూ పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తిస్వామి కొండకు భక్తులు పోటెత్తారు. ఆదివారం అమావాస్య కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా పల్లె ప్రాంతాల నుంచి భక్తులు ద్విచక్ర వాహనాలు, ఆటోలు కాలినడకన స్వామివారి కొండకు భారీగా తరలివచ్చారు. ఆషాడమాసం ముగిసి శ్రావణమాసం ప్రారంభమవుతున్న సందర్భంగా పల్లె జనులు శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. జాతర మైదానంతో పాటు ప్రధాన మెట్లపై బారులు తీరి క్యూలైన్‌లలో నిల్చుని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల గోవింద నామస్మరణతో కురుమతి గిరులు పులకరించాయి. శ్రీ కురుమూర్తి కొండకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల రాకతో భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు.

## తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు..

**మొదటి పేజీ తరువాయి భాగం..**
ఇలాంటి అన్నమే పెడుతారా అని వారు ప్రశ్నించారు. తమ పిల్లలకేమో పరమాన్నం పెడుతూ మా పిల్లలకు పురుగుల అన్నం పెట్టడమేమిటని వసతి గృహం ముందు ఆందోళన వ్యక్తం చేశారు. వసతి గృహ తనిఖీ విచ్చేసిన ఉన్నతాధికారులు విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడి నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు.

**వసతి గృహ ఆవరణలో పిచ్చి మొక్కలు...** వసతి గృహ ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి విష స్పరాలు, క్రిమి కిటకాలకు ఆవాస స్థలంగా ఏర్పడిందని విద్యార్థినులు పేర్కొంటున్నారు. ఆవరణలో లైట్లు లేకపోవడంతో పూర్తిగా చీకట్లో గడుపుతున్నామని, రాత్రి సమయాల్లో లైట్లు లేకపోవడంతో బయటకు వెళ్లాలంటే ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహం పూర్తిగా ఊరికి బయటకు ఉండటం, చుట్టు ప్రక్కల వ్యవసాయ పొలాలు సైతం ఉండటంతో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో వాటిలో ఏమైన క్రిమి కిటకాలు, విష సర్పాలు ఉంటాయమోనని విద్యార్థినులు బిక్కు బిక్కుమంటు గడుపుతున్నామని విద్యార్థినులు పేర్కొన్నారు.

## భక్తులతో పులకించిన శ్రీరామకొండ దివ్యక్షేత్రం..

**మొదటి పేజీ తరువాయి భాగం..**
ప్రయాణంలో కొండనిండా వెలసిన వనమూలికలను తమవెంట తీసుకెళ్లారు.

**భక్తులకు అన్నదానం....** శ్రీరామకొండ దివ్యక్షేత్రం దిగువ భాగాన భక్తులకు పేట మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నవోదయ విద్యాసంస్థల అధినేత ఎస్.రవిందర్‌రెడ్డి అన్నదానం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన సిరాజుద్దీన్ భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కొండ దిగువ భాగాన అన్నదాన కార్యక్రమం చేపట్టడంతో భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు. అన్నదాన కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బి.కృష్ణ, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మల్లయ్య యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, నాజీమ్, టివి ఖాజా, కె.రాజు, శ్యాంసుందర్, జి. శ్రీనివాసులు, మొహిన్‌ఖాన్, గోవర్ధన్, నరేష్, పి.నగేష్, మొగులయ్య, రాములు, రమేష్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిట్ ఇంజనీర్‌గా బత్తుల విజయ్ కుమార్

**వీపనగండ్ల ఆగష్టు 4 ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన బత్తుల సరోజ ఆదయ్య దంపతులకు చెందిన బత్తుల విజయ్ కుమార్ ఇటీవల వెలబడిన పంచాయతీరాజ్ ఉద్యోగాలలో ,సివిల్ విభాగంలో పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) గజిటెడ్ ఉద్యోగం సాధించడం జరిగిందని అతని తండ్రి ఆదయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం నాడు మాజీ సర్పంచ్ లు పుట్ట గంగిరెడ్డి వి. నరసింహా రెడ్డి స్థానికులు శాలువా కప్పి వారికి సన్మానించారు. గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులు బాగా చదువుకొని పై స్థాయి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. విజయ్ కుమార్ తో పాటు నీటిలో ర్యాంకు సాధించిన మునిగొండ గోపి కుమార్తె మునిగుండ అచలను కూడా సన్మానించారు. వీరు ఇద్దరు కూడా వీపనగండ్ల గ్రామానికి చెందిన మీ జూనియర్స్ కు ఆదర్శంగా ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు దిక్సూచి వంటి వారని వీరిని ఆదర్శంగా తీసుకొని గ్రామాలలో ఉండే విద్యార్థులు పై చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. అయితే విజయ్ కుమార్ విద్యాభ్యాసం ప్రాథమిక పాఠశాల వీపనగండ్ల, ర్యాంకర్స్ హై స్కూల్ వనపర్తి, సివిల్ విభాగంలో డిప్లమా కేడీఆర్ పాలిటెక్నికల్ కళాశాల వనపర్తి, బీటెక్ వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ శంషాబాద్, ఎంటెక్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతి లో పూర్తి చేయడం జరిగింది. గేట్ కూడా క్వాలిఫైడ్ కావడంతో భవిష్యత్తులో డిపార్ట్మెంట్ పరంగా రీసెర్చ్ విభాగం దిశగా ప్రయత్నం చేయడం జరుగుతుందని అతని తల్లిదండ్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తుల ఆదయ్య రవీందర్ రెడ్డి, మహేష్ నాయుడు, మునికొండ గోపి, సరోజ పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించడం శుభ పరిణామం

**బాలానగర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కెఎస్ ఆర్. వెంకట్‌రెడ్డి**

**బాలానగర్, ఆగష్టు 4 ప్రభాతవార్త :** పేదల పెన్నిధి కాంగ్రెస్ సర్కార్ అని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పథంలో నడుస్తుందని, జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రత్యేక కృషితో జడ్చర్ల నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కెఎస్ ఆర్ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి కాంగ్రెస్ సర్కార్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని, తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులు అందరికీ ఇది ఎంతో శుభపరిణామమని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తుందని, అలాగే గ్యాస్ సిలిండర్లపై సబ్సిడీ, ఉచిత విద్యుత్ లాంటి పథకాలు అమలు చేసి ప్రజల హృదయాలను గెలుచుకుంటుందని తెలిపారు. త్వరలోనే మహాలక్ష్మి పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదలైన తర్వాత అర్హులైన వారందరికి రూ. 4 వేలను ప్రభుత్వం అందజేయనుందని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కూడా సీఎం రేవంత్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే ప్రత్యేక కృషితో అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతాయని తెలిపారు. ప్రజా పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## యాచిస్తే కాదు పోరాడితేనే రెండు పడక గదుల ఇళ్ళు....



డబుల్ బెడ్రూమ్ వివరాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

**గద్వాల ఆగష్టు 4 ప్రభాతవార్త :** యాచిస్తే రెండు పడక గదుల ఇళ్లను పంపిణీ చేయరని తిరగబడి పోరాడితేనే రెండు పడక గదుల ఇళ్లను సాధించుకోగలమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేర్ నరసింహ అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు వార్డులలో డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ని రోజులు జిల్లా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులపై నమ్మకం ఉంచి లబ్ధిదారులు సహనంతో వేచి చూశారని అధికారులు ప్రజాప్రతినిధుల కార్యాలయాలు ఇళ్ల చుట్టూ ప్రదక్షణలు చేసిన వారికి కనికరం రాలేదన్నారు, కార్యలయాలు ఇళ్ల చుట్టూ తిరగకుండా తిరగబడి పోరాడి పేదలు తమ డబల్ బెడ్ రూమ్ ఇళ్లను సాధించుకోవాలని పిలుపునిచ్చారు, కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగే కొద్ది స్థలాలు కొనలేక ఇండ్లను నిర్మించుకొలేక పేదలు ఎన్ని ఇబ్బందులకు గురి అవుతారో స్థానిక ప్రజాప్రతినిధులు అధికార యంత్రాంగం లబ్ధిదారుల వైపు నుంచి కూడా మానవతా దృక్పథంతో ఆలోచించాలని అన్నారు. లబ్ధిదారులు అనుభవిస్తున్న బాధలను చూసి కూడా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల మనసు కరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులు తమ ప్రతిఘటన పోరాటాల ద్వారానే ఇల్లు సాధించుకోగలుగుతారని అన్నారు రెండు పడక గదుల ఇళ్లను పంపిణీ చేయకపోవడానికి గల కారణాలు ఎంటో లబ్ధిదారులకు బహిరంగంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు. 1300 కుటుంబాలు 5200 మంది వ్యక్తుల జీవితాలను పణంగా పెట్టి పాలకుల, అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య బాధ్యతరహిత్యానికి లబ్ధిదారులు ఐక్యంగా ఉండి రెండు పడక గదులు సాధించుకోదవాలని అన్నారు. లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇళ్లను పంపిణీ చేసేందవరకు వారి ముందుండి చివరి వరకు సిపిఎం పార్టీ ఉద్యమిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, ఎల్లప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బీచుపల్లి పుణ్యక్షేత్రంలో భక్తుల సందడి...

**ఆలయంలో పూజలు చేసిన సినీ నటుడు పూరి ఆకాష్...**



ఆలయం ముందు సినీ నటుడు పూరి ఆకాష్

**ఇటిక్యాల ఆగష్టు 4ప్రభాతవార్త :** ఆదివారం అమావాస్య కావడంతో మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని ఆలయాలలో భక్తులతో సందడిగా మారింది. ఈ సందర్భంగా బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో డైరెక్టర్ పూరి జగన్నాథ్ కుమారుడు సినీ నటుడు పూరి ఆకాష్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి క్యూ పద్ధతిన స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అదేవిధంగా పుణ్యక్షేత్రంలోని గల ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీచుపల్లి కృష్ణానదికి వరద ప్రవాహం శ్రీశైలం ప్రాజెక్టుకు కృష్ణమ్మ పరుగులు పెడుతుండగా శివాలయం పక్కన ఉన్న పుష్కర్ ఘాట్ ల వద్ద భక్తులు స్నానాలు నిర్వహించారు. వరద నీరు ఎక్కువగా ఉండటంతో కాక అమావాస్య సందర్భంగా బీచుపల్లికి భక్తులు వస్తుండంతో ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు గజ ఈతగాళ్లు భక్తులను నదిలోకి ఎవరిని వెళ్ళనీయకుండా చూశారు.

## కలెక్టరేట్ల ముట్టడిని విజయవంతం చేయండి

**మక్తల్, ఆగస్టు 04 ప్రభాతవార్త :** ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాలకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు కిరణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మక్తల్ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల పెంపు, రైతు భరోసా, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల ఆర్థిక సహాయం వంటి హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే భూమిలేని నిరుపేదలకు రూ. 12 వేల జీవన భృతి చెల్లించాలని అన్నారు. రేషన్ కార్డులతో సంబంధం లేకుండా రైతులందరికి రుణమాఫీ చేయాలని అన్నారు. ఈ నెల 8న కలెక్టరేట్ల ముట్టడి, 21న ఛలో హైదరాబాద్ కార్యక్రమాలకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె. వెంకటేష్, బి.భాస్కర్, శేఖర్, అశోక్, పవన్, నరేష్, రవి, అయ్యప్ప, హరి పాల్గొన్నారు.

## గోశాలలో ప్రత్యేక పూజలు

**జడ్చరన, ఆగస్టు 04 ప్రభాతవార్త :** బాదేపల్లి, జడ్చర్ల పట్టణంలోని రమా సహిత సత్యనారాయణస్వామి గోశాలలో ఆదివారం అమావాస్య సందర్భంగా గోశాలలో గోవులుకు ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్త ప్రానేష్ మాట్లాడుతూ భారతదేశంలో సంస్కృతి సంప్రదాయాలలో గోవుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రతి ఇంట గోమాతను పూజించాలనే భక్తి భావంతో అలవర్చుకోవాలన్నారు. తమ పిల్లలకు సంస్కృతి సంప్రదాయాల భక్తి భావన పెంచి భక్తి ప్రవచనాలు నేర్పించి భక్తి మార్గంలో నడపాలని, ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలలో పాలుపంచుకుంటూ యువతరం సేవా భావన అలవర్చుకోవాలన్నారు. భక్తులు భజన పాటలు మారుమోగించారు. కార్యక్రమంలో కమిటి సభ్యులు పెరుమాళ్ల తిరుపతిరెడ్డి, చిగుళ్లపల్లి లక్ష్మినారాయణ, పద్మలీల, రాధ, మంచన పాండయ్య, మంచన గణేష్, లవకుమార్, రామ్మోహన్, గుబ్బ నర్సింలు, రాజు, అల్లంపల్లి శ్రీధర్, గోనెల రాధాకృష్ణ, మహిళలు, గోశాల భక్తబృందం పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్



**వెల్దండ, ఆగస్టు 04 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు జంగిలి ప్రసాద్ తల్లి జంగిలి మొగులమ్మ గత వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మొగులమ్మ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించి కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. పూరి రమేష్, ప్రవీణ్, ప్రసాద్, జ్యోతయ్య తదితరులు ఉన్నారు.

## బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత...



**వెల్దండ, ఆగస్టు 04 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన నేనావత్ తారాసింగ్ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ధరఖాస్తు చేసుకోగా బాధితుడికి మంజూరైన రూ.16500ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్, సుమన్‌నాయక్, గుర్వయ్య, మండె శ్రీను, గణేష్ తదితరులు ఉన్నారు.

## ఎల్ఓసి కాపీని అందించిన అలంపూర్ ఎమ్మెల్యే...



**ఇటిక్యాల ఆగష్టు 4 ప్రభాతవార్త :** అలంపూర్ మండల పరిధిలోని క్యాతూరు గ్రామానికి చెందిన నరేంద్ర ఆపరేషన్ కొరకు ఆదివారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఆయన చేతుల మీదుగా వారికి 6 లక్షల రూపాయల ఎల్ఓసి కాపీని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్ రెడ్డి, కోదండరాంరెడ్డి, దేవా తదితరులు ఉన్నారు.

## స్నేహబంధం మరువలేనిది

**ఇటిక్యాల ఆగష్టు 4 ప్రభాతవార్త :** మానవ జీవితంలో స్నేహ బంధం మరువలేనిదని స్నేహితులు గుర్తు చేసుకున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని వల్లూరు గ్రామ స్టేజి నందు 1986 టెన్త్ క్లాస్ బ్యాచ్ కు చెందిన ఎద్దుల గోవర్ధన్ రెడ్డి, మద్దిలేటి రెడ్డి, వెంకట్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి తదితరులు కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు ముందుకొచ్చి వల్లూరు స్టేజిలో ప్రయాణికులు కూర్చునేందుకు వీలుగా నాలుగు సిమెంటు కుర్చీలను కూడా ఏర్పాటు చేశారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ ల అధ్యక్షుడు సాయిబాబా ను శాలువతో సత్కరించి మొక్కలు నాటారు సాయిబాబా వాళ్ళ స్నేహ బంధానికి మంచి గుర్తు ఉండేలాగా ఈ చెట్లను కచ్చితంగా కాపాడుకుంటామని ప్రమాణం చేశారు ఇలాంటి కార్యక్రమాలు మున్ముందు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వల్లూరు గ్రామ నాయకుడు గిడ్డారెడ్డి, గోపాల్‌రెడ్డి ,దామోదర్‌రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలలకు ఎంపిక కావడం గర్వకారణం



**మక్తల్, ఆగస్టు 04 ప్రభాతవార్త :** మక్తల్ ప్రాంతానికి చెందిన 8 మంది విద్యార్థులు ఇటీవల జరిగిన క్రీడా పాఠశాల ఎంపికల్లో తమ అసమాన ప్రతిభ కనబర్చి క్రీడా పాఠశాలలో ప్రవేశం పొందడం గర్వకారణమని ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు, విశ్రాంత పీఈటీ బి.గోపాలం అన్నారు. ఆదివారం మక్తల్‌లో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గత రెండు నెలలుగా విద్యార్థులకు కఠోరమైన శిక్షణ అందించి, క్రీడా పాఠశాలల్లో ప్రవేశం కోసం కృషి చేయడం జరిగిందన్నారు. హకీంపేట క్రీడా పాఠశాలకు యశ్వంత్‌గౌడ్ (మాగనూరు), భ్రమరాంబికా (ఉజ్జెల్లి), కరీంనగర్ క్రీడా పాఠశాలకు తిరుమలేష్ (మాగనూరు) వికాస్ (నాగిరెడ్డిపల్లి), అనిత (ఉజ్జెల్లి), ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు శ్రావణ్‌కుమార్ (ఎడవెల్లి), శ్రీలక్ష్మి (ఉజ్జెల్లి), పవన్‌కుమార్ (ఉజ్జెల్లి)లు ఎంపిక కావడం జరిగిందన్నారు. వీరంతా ఈనెల 10లోపు ఆయా పాఠశాలల్లో ప్రవేశం పొందుతారన్నారు. ప్రవేశం పొందిన వీరికి నాణ్యమైన విద్యతో పాటు క్రీడల్లో మెరుగైన శిక్షణ అందించి ఉచితంగా వసతి కల్పిస్తారన్నారు. ఈ సందర్భంగా క్రీడా పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులను శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కోచ్‌లు అమ్రేష్, రమేష్ పాల్గొన్నారు.

